టపాసులు అక్రమంగా విక్రయిస్తే చర్యలు

● ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): అక్రమంగా టపాసులు విక్రయించినా, నిల్వ ఉంచినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ జగదీష్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. లైసెన్స్ ఉన్న దుకాణాదారులు మాత్రమే టపాసులు విక్రయించాలన్నారు. జిల్లాలో శాశ్వత, తాత్కాలిక లైసెన్సు ఉన్న దుకాణాదారులు మాత్రమే బాణ సంచా అమ్మకాలు చేయాలన్నారు. తాత్కాలిక లైసెన్సుదారులు సైతం ప్రభుత్వ యంత్రాంగం నిర్దేశించిన బహిరంగ ప్రదేశాల్లోనే నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్లలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. షెడ్ల వద్ద నీరు, ఇసుక, ఇతర అగ్ని మాపక సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. దుకాణాల వద్ద ఏం చేయాలి, ఏం చేయకూడదో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలను విక్రయ దుకాణాల్లో ఉంచుకోకూడదన్నారు. ప్రజలు టపాసులు పేల్చే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా విక్రయాలు చేసినా, నిల్వ ఉంచినా వెంటనే నెంబర్లు 100, 112కు కాల్ చేయాలని, సంబంధిత పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మొరాయించిన మోటార్లు

రాగులపాడు లిఫ్ట్ వద్ద పనిచేయని వైనం

హంద్రీనీవా కాలువ నుంచి ఎస్కేప్ చానల్ ద్వారా నీటి మళ్లింపు

10

వందేభారత్‌కు పురంలో స్టాపింగ్

● రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న

10

కలం కావాలి.. జనహితం

● సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ సురేష్‌కుమార్

8



గుంతకల్లుకు భాగ్యం..

ఓ సినిమాలో భాగ్యం క్యారెక్టర్‌తో మెప్పించిన హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ గుంతకల్లులో శుక్రవారం సందడి చేశారు. ఓ ప్రైవేటు కార్యక్రమానికి మరో హీరోయిన్ రితికా నాయక్‌తో కలిసి ఆమె హాజరయ్యారు. ఇరువురు అభివాదం, డ్యాన్సులతో అభిమానులను హుషారెక్కించారు. వారిని చూసేందుకు అభిమానులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు.

-గుంతకల్లు టౌన్ (ఆంధ్రజ్యోతి)

● విధులకు రాకున్నా ఉద్యోగులకు జీతాలు
● ఆస్పత్రుల నుంచి కొందరి అక్రమ వసూళ్లు
● మామూళ్లతో కళ్లు మూసుకుంటున్న అధికారులు

ఏఎంసీలో అవినీతి కంపు!

కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో సిబ్బంది ఇష్టారాజ్యం



ఎన్టీఆర్ మార్గ్‌లో డ్రైనేజీ కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు



కమలానగర్‌లో మురుగు కాలువ దుస్థితి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏఎంసీ(అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్) పారిశుధ్య విభాగంలో అవినీతి కంపు కొడుతోంది. అధికారుల పర్యవేక్షణ కొవడటంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారు. కనీస విద్యార్హత లేనివారిని శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా నియమించడంతో పారిశుధ్య వ్యవస్థ భ్రష్టు పట్టిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటింటి చెత్త సేకరణ, నిత్యం మురుగుకాలువల్లో పూడికతీత పట్ల పారిశుధ్య సిబ్బంది పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న డీఈకి ఎంహెచ్‌ఓ బాధ్యతలు అదనంగా అప్పగించడంతో పని భారమై, పర్యవేక్షణ కొరవడుతోంది. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలోకి వెళ్లకపోవడంతో విధులకు ఎంత మంది పారిశుధ్య సిబ్బంది వస్తున్నారో కూడా తెలియకుండా పోతోంది.

ఆస్పత్రుల నుంచి చెత్త సేకరణలో భారీ అక్రమాలు

సాధారణంగా ఆస్పత్రుల్లో వాడే పరికరాలు, సూదులు, ఇతర వాటిని ఏఎంసీ పారిశుధ్య విభాగం వారు సేకరించరు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వారే ఆస్పత్రుల్లో వాడిన సూదులు, సిరంజిలు, ఆపరేషన్‌కు సంబంధించి వస్త్రాలు, పరికరాలను తీసుకుని, ప్రత్యేక ప్రాంతాలకు తరలిస్తారు. మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన సాధారణ చెత్త సేకరణ వాహనాల్లో తీసుకుని, డంపింగ్ యార్డులోకి వెళ్లకుండా చూడాలి. అయితే అనంత నగరంలో మాత్రం సుమారు 400ఆస్పత్రులలో నుంచి సేకరించిన వ్యర్థాలను ఏఎంసీ సాధారణ చెత్త సేకరణ వాహనాలలో తరలించి డంపింగ్ యార్డులో పడేస్తున్నారు. ఇందుకుగాను ప్రతి నెలా ఒక్కో ఆస్పత్రి నుంచి రూ.10వేల నుంచి రూ.50వేల వరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వసూళ్లు చేస్తున్నారనే చర్చ సాగుతోంది. ఇలా ఆస్పత్రుల నుంచి తరలించిన వ్యర్థాలను సాధారణ వ్యర్థాలతో కలపడం వల్ల పారిశుధ్య సిబ్బందితో పాటు ప్రజలు ఇబ్బంది పడే ప్రమాదం ఉంది. ఒక్కోసారి రోగులకు వాడిన సిరంజీ, మందులు తగిలి ప్రాణాపాయం కలిగే అవకాశం ఉంది. అయితే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఇవేమీ పట్టించుకోకుండా అక్రమ వసూళ్లకు దిగుతున్నట్లు సమాచారం.

డాక్టర్‌నే ఎంహెచ్‌ఓగా నియమించాలి

ఏఎంసీలో శానిటేషన్ విభాగం కీలకం. నగరంలో పరిస్థితులు శుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండాలంటే పారిశుధ్యం నిర్వహణ మెరుగ్గా ఉండాలి. అలాంటి కీలక విభాగానికి డాక్టర్‌నే నియమించాలి. పైగా శానిటేషన్‌లో ఏడాది డిప్లొమా కోర్సు పూర్తి చేసి ఉండాలి. ఎందుకంటే ప్రతి నిత్యం విధుల్లో ఉండే పారిశుధ్య కార్మికులకు రెండు మూడు రోజుకు ఒక సారి హెల్త్ చెకప్ చేయాల్సి ఉంటుంది. బదిలీ వర్కర్లను నియమించుకోవడానికి కనీసం 40శాతం ఆరోగ్యం క్షీణించి ఉండాలి. ఇవన్నీ పరిశీలించడం ఒక వైద్యుడికే సాధ్యమవుతుంది. అందుకే ఎంహెచ్‌ఓగా డాక్టర్‌నే నియమించాలనేది ప్రభుత్వ నిబంధన.

విధులకు రాకున్నా జీతాలు

ఏఎంసీ పారిశుధ్య విభాగంలో కొందరు సిబ్బంది విధులకు గైర్హాజరవుతూ, జీతాలు మాత్రం కచ్చితంగా డ్రా చేస్తున్నారు. ఇలాంటివారు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లకు వాటాలు ఇస్తున్నట్లు సమాచారం. పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న రెగ్యులర్ వర్కర్లు బదిలీ వర్కర్ల పేరుతో విధులకు డుమ్మా కొడుతున్నారు. బదిలీ వర్కర్ల నియమకానికి ఎంహెచ్‌ఓ ద్వారా కమిషనర్ అనుమతి పొందాలి. అయితే ఏఎంసీలో మాత్రం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అందినకాడికి పుచ్చుకుని ఇష్టానుసారంగా బదిలీ వర్కర్లు నియమిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో సర్కిల్‌లో ప్రతి నిత్యం పది మంది చొప్పున, ఆరు సర్కిళ్లలో మొత్తం 60మంది వరకు విధులకు డుమ్మా కొడుతున్నారని తోటి కార్మికులే చెబుతున్నారు. సాధారణంగా పురుష ఉద్యోగుల స్థానంలో పురుష వర్కర్లనే నియమించాలనే నిబంధనకు తూట్లు పొడుస్తున్నారు.

ప్రత్యేక దృష్టి పెడతాం



పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెడతాం. కొంతమంది విధులకు హాజరుకాకుండా డుమ్మా కొడుతున్నారని, జీతాలు తీసుకుంటున్నారని చెబుతున్నారు. హాజరు పట్టిక, జీతాల చెల్లింపు వివరాలను పరిశీలిస్తాం. ఏఎంసీలో శానిటేషన్ విభాగంలో కొంత నిర్లక్ష్యం ఉన్న మాట వాస్తవమే. పారిశుధ్య విభాగాన్ని ప్రక్షాళన చేసే దిశగా అధ్యయనం చేస్తున్నాం. అర్హత లేని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. ఆస్పత్రుల వ్యర్థాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లోనే సేకరించి, సూచించిన చోటకు తరలించాలి. సాధారణ చెత్తవాహనాల్లో సేకరిస్తే ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరం. అలా చేసే సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

- నరసింహులు, ఎంహెచ్‌ఓ, నగరపాలక సంస్థ

● 8లో.. శిశుగృహ కేంద్రం సిబ్బందికి నోటీసులు

● సచివాలయంలో వైసీపీ నాయకుడి బర్త్‌డే

● మద్యం మత్తులో అల్లరి.. జైలుకు యువకులు

రాష్ట్ర పోటీలకు ఇద్దరు విద్యార్థులు

ఆసక్తికరంగా సాగిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ పోటీలు



ప్రతిభ చూపిన విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న అధికారులు

అనంతపురం విద్య, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ పోటీలు ఆసక్తికరంగా సాగాయి. మండలస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు శుక్రవారం జిల్లా సైన్స్‌సెంటర్‌లో జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. ఈసెమినార్‌కు 23 మండలాల నుంచి 46మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆర్ట్స్‌కళాశాల అధ్యాపకులు డాక్టర్ కిషోర్, డాక్టర్ చంద్రశేఖర్ న్యాయనిర్ణేతలుగా ఉంటూ వివిధ అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో అత్యంత ప్రతిభ చూపిన తాడిపత్రి మోడల్ స్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని హాజియా తబ్బుంకు మొదటి బహుమతి లభించింది. గుంతకల్లు రైల్వే హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఉదిత్ రెండో బహుమతి సాధించాడు. వీరిద్దరు ఈ నెల 18న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి సెమినార్ పోటీల్లో పాల్గొంటారని ఏపీసీ శైలజ తెలిపారు. విద్యార్థులను డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ, జిల్లా సైన్స్‌సెంటర్ అధికారి బాలమురళి తదితరులు అభినందించారు.

కేఎస్‌ఆర్‌లో నీటి కష్టాలకు చెక్

● ఆర్వో ప్లాంటును ప్రారంభించిన ఎంపీ



ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం విద్య, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేఎస్‌ఆర్‌బాలికల ఉన్నతపాఠశాల విద్యార్థినులకు తాగునీటి కష్టాలు తీరాయి. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, డీఈఓ ప్రసాద్‌బాబు శుక్రవారం ప్రారంభించారు. గత ఆరేడు నెలలుగా తాగునీటి కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దసరా సెలవులకు ముందు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన విషయం తెలిసిందే. అప్పటికే ఈపాఠశాలకు ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు కోసం ఎంపీ అంబికా తన ఎంపీ నిధుల నుంచి రూ.5లక్షలు కేటాయించారు. వాటితో ఆర్వో ప్లాంట్ నిర్మాణ పనులను వేగవంతం చేశారు. ఆర్వో ప్లాంట్ ప్రారంభించిన తర్వాత ఎంపీ స్వహస్తాలతో విద్యార్థులకు తాగునీటి బాటిళ్లను అందజేశారు. సమస్య తీరడంతో విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీ, డీఈఓ మధ్యాహ్నభోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి కోసం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అభిలషించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీదేవి, హెచ్‌ఎం బాలకృష్ణ, రిటైర్డ్ హెచ్‌ఎంలు నారాయణ స్వామి, ఆంజనేయులు, టీచర్లు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని చెరువులకు నీరిస్తాం

● ఎమ్మెల్యే పరిటాల సునీత



యర్రగుంట సమీపంలో చెక్‌డ్యాం వద్ద నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రాప్తాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అవకాశం ఉన్న ప్రతి చెరువుకు నీరు అందిస్తామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. మండలంలోని యర్రగుంట గ్రామ సమీపంలో హంద్రీనీవా నీటితో పొంగి పొర్లుతున్న చెక్‌డ్యాంను శుక్రవారం ఆమె టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క చెరువుకైనా అదనంగా నీరు అందించారా అని ప్రశ్నించారు. పండమేరు వంక ద్వారా అనంతపురం చెరువుకు వెళుతున్న సాగు నీటి ప్రవాహంలో ఏవైనా అడ్డంకులు ఉన్నాయా అని ఆరా తీశారు. నీరు వృథా కాకుండా చూడాలని, ఎక్కడైనా వృథా జరిగితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. హంద్రీనీవా నీటిని కుప్పం తీసుకువెళుతున్నారని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. రైతులు ఎవ్వరూ అలాంటి దుష్ప్రచారాలను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, మండల కన్వీనర్ కొండప్ప, డీలర్ రాజా పాల్గొన్నారు.

బతుకుపోరు..!



పరిగిలోని గార్మెంట్ పరిశ్రమలో పనిచేస్తున్న మహిళలు

కరువుతో సేద్యం డీలా పడింది. రైతులు కూలి పనులకు వెళ్లసాగారు. అవి కూడా దొరకడం గగనమైంది. ఇల్లు గడవడం భారంగా మారింది. పిల్లలను, ఊరిని వదిలి వలసబాట పట్టారు. పరాయి పంచన ఎన్నో కష్టాలు పడ్డారు. అయినా.. కడుపు నిండేది కాదు. ఆ పరిస్థితుల్లో గార్మెంట్స్ జిల్లాకు వచ్చాయి. వేల మంది మహిళలకు ఉపాధి చూపాయి. కూలి కూడా దొరకని పరిస్థితుల్లో వేలల్లో వేతనాలు ఇవ్వసాగాయి. ఎన్నో కుటుంబాల్లో ఆర్థిక భరోసా నింపాయి. వేలాది కుటుంబాల ఆర్థిక చిత్రం మారిపోయింది. టీడీపీ హయాంలో ప్రతి నియోజకవర్గంలో గార్మెంట్స్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని భావించారు. ఆ దిశగా మంత్రుల బృందం పరిశీలించింది. ఇంతలోనే ఎన్నికలు రావడం, వైసీపీ అధికారం చేపట్టడంతో గార్మెంట్స్ ఆశలు అడియాసలయ్యాయి. కూటమి ప్రభుత్వం గార్మెంట్స్ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్రహిస్తే వేలాది కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నిండుతాయి. ఆ దిశగా చర్యలు చేపట్టాలని అనంతవాసులు కోరుతున్నారు.

అతివల ఆర్థిక శక్తి.. గార్మెంట్స్

● జిల్లాలో వేల మందికి ఉపాధి
● మారుతున్న కుటుంబ ఆర్థిక చిత్రం
● నియోజకవర్గానికొకటి ఏర్పాటు దిశగా టీడీపీ ప్రభుత్వం సమాలోచనలు
● అమలు చేస్తే.. ఆర్థిక వెలుగులే..

పుట్టపర్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గార్మెంట్స్ అంటే పదేళ్ల కిందట బెంగళూరు, దొడ్డబాళ్లాపురం గుర్తుకొచ్చేవి. అప్పట్లో జిల్లా నుంచి గార్మెంట్స్‌లో పని చేసేందుకు వేలాదిమంది వలస వెళ్లేవారు. బెంగళూరు, దొడ్డబళ్లాపురం, రాజన్నకుంట, యలహంక తదితర ప్రాంతాల్లో అనంత జిల్లావాసులే ఎక్కువగా పనిచేసేవారు. జిల్లాలో కార్మికులు అధికంగా దొరుకుతుండడంతో పదేళ్ల కిందట హిందూపురం ప్రాంతంలోని తూమకుంట పారిశ్రామిక వాడలోకి గార్మెంట్స్ పరిశ్రమలు అడుగు పెట్టాయి. ఆ తరువాత హిందూపురం, పరిగి, చిలమత్తూరు, గోరంట్ల, మడకశిర ప్రాంతాల్లో 15 పరిశ్రమల దాకా ఏర్పాటయ్యాయి. గార్మెంట్స్ పరిశ్రమల్లో హెల్పర్ నుంచి టైలర్ నైపుణ్యతను బట్టీ నెలకు రూ.9వేల నుంచి రూ.30వేలదాకా వేతనం ఇస్తున్నారు. ఇలా జిల్లాలో 20 వేల మందికిపైగా మహిళలకు ఉపాధి లభిస్తోంది. దీంతో కొత్త పరిశ్రమ వస్తోందంటే చాలు.. కార్మికులు క్యూ కడుతున్నారు. గార్మెంట్స్‌లో కుట్టు శిక్షణ కేంద్రాలు భారీగా వెలుస్తున్నాయి. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గర్లోనే ఉండడం (మిగతా 10లో..)

మార్చికి టిడ్కో ఇళ్లు అప్పగిస్తాం

● ఎమ్మెల్యే దగ్గుపాటి

ఏఎంసీ కమిషనర్, ఎస్ఈ, టిడ్కో ఇంజనీర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్లను మార్చి చివరికి లబ్ధిదారులకు అప్పగిస్తామని అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి శుక్రవారం ఆయన స్థానిక చిన్నయనగర్‌లోని టిడ్కో గృహాల సముదాయాన్ని పరిశీలించారు. టిడ్కో గృహ సముదాయంలో కలియతిరిగి, ఇళ్లలోని సామగ్రి నాణ్యతను పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కారాదన్నారు. టీడీపీ హయాంలోనే 27బ్లాక్‌లను పూర్తి స్థాయిలో నిర్మించారని, తిరిగి 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాకనే టిడ్కో గృహాల నిర్మాణం పునఃప్రారంభించామని తెలిపారు. అర్బన్ నియోజకవర్గంలో 5100ఇళ్ల నిర్మాణం చేపట్టామని, ఇందులో 1620ఇళ్లు పూర్తి చేశామన్నారు. మిగిలిన ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని, వీటి పూర్తికి రూ.68కోట్లు నిధులు అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనంత నగరపాలక సంస్థ ఎస్ఈ రాజశేఖర్, టిడ్కో ఈఈ సుధారాణి, ఏఈలు శేఖర్, అవినాష్, భారతి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు బుగ్గయ్యచౌదరి, జయరాంనాయుడు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, జిల్లా అధికారప్రతినిధి సరిపూటి రమణ, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికారప్రతినిధి ఫిరోజ్‌అహ్మద్, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, డైరెక్టర్ మూర్తి, నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


కాటమరాజు (ఫైల్)

తాడిమర్రి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లప్పల్లి బస్టాండ్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాటమరాజు(33) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పిన్నదరి గ్రామానికి చెందిన ఆదెప్ప కుమారుడు రామాంజనేయులు పెయింటర్‌గా పనిచేస్తు జీవనం సాగించేవాడు. గురువారం సాయంత్రం బత్తలపల్లి నుంచి పిన్నదరికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పుల్లప్పల్లి బస్టాండ్ వద్ద బొలెరో వాహనాన్ని ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడిన కాటమరాజును అనంతపురం ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య


చింతకాల బాబు (ఫైల్)

బుక్కపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చయ్యగారిపల్లి గ్రామంలో చింతకాయల బాబు(43) అనే వ్యక్తి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు బాబు కియ పరిశ్రమలో పని చేస్తుండేవాడు. ఆర్థిక, వ్యక్తిగత సమస్యలతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించి బంధువులు గ్రామంలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు.

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు

అనంతపురం క్రైం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై అత్యాచారం ఘటనలో ఓ వ్యక్తికి పదేళ్ల జైలు, రూ.5వేల జరిమానాను కోర్టు విధించింది. వివరాలు ఇలా.. ఆత్మకూరు మండలం వడ్డుపల్లికి చెందిన 66 ఏళ్ల వృద్ధురాలు ఇంటి ముందు నిద్రిస్తుండగా మదిగుబ్బ గ్రామానికి చెందిన 50 ఏళ్ల పెద్దన్న 2018 జూలై 27న అత్యాచారం చేశాడు. దీనిపై అదే నెల 28న ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ సాగర్ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ శివనారాయణస్వామి దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. ఈ కేసులో 11 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో పెద్దన్నకు జైలు శిక్ష విధిస్తూ అనంతపురం నాలుగో సెషన్స్ కోర్టు న్యాయాధికారి హరిత శుక్రవారం తీర్పు ఇచ్చారు. సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్ఐలు శ్రీనివాసులు, శౌరెడ్డి, కానిస్టేబుల్ షేక్షావలి సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపర్చడం, నిందితులకు శిక్షపడటంలో కీలకంగా కృషి చేయడంతో జిల్లా ఎస్పీ జగదీష్ వారిని ప్రత్యేకంగా అభినందించారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ శేఖర్

అనంతపురం క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలుడిని అనంతపురం రూరల్ పోలీసులు క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. అనంతపురం రూరల్ సీఐ శేఖర్ రూరల్ స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. రూరల్ మండలంలోని కొడిమి దర్గా కొట్టాలకు చెందిన వేణు కుమారుడు రామాంజనేయులు (10) ఉరవకొండలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ నాలుగో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవుల తర్వాత తన రెండో అన్న నరసింహతోపాటు హాస్టల్‌కు వెళ్లేందుకు బయలు దేరాడు. ఏమైందో ఏమో కానీ హాస్టల్‌కు వెళ్లను అంటూ బస్సులో ఏడవడం మొదలు పెట్టాడు. దీంతో బాలుడి పెద్దన్న ఈశ్వర్ రాచానపల్లి వద్ద దర్గా కొట్టాలకు వెళ్లే రోడ్డులో రామాంజనేయులును దించేశాడు. బాలుడు అమ్మ కొడుతుందన్న భయంతో ఇంటికి వెళ్లకుండా ఈనెల 11న రైల్వేస్టేషన్‌కు వెళ్లి, తర్వాత కనిపించకుండా పోయాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు ఈనెల 12 ఫిర్యాదు చేయడంలో పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు నాలుగు బృందాలుగా రంగంలోకి దిగి దర్యాప్తు మొదలెట్టారు. అనంతపురం బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రభుత్వాసుపత్రి, అనంతపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో ముమ్మరంగా గాలించారు. అయితే బాలుడు వజ్రకరూరు మండలం కమలపాడుకు చెందిన తలారి రామాంజనేయులు అనే వ్యక్తి ద్వారా ఆయన ఊరికి వెళ్లినట్టు గుర్తించారు. పోలీసుల బృందం అక్కడికెళ్లి బాలుడిని తీసుకొచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం బాలుడిని వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు.

విద్యార్థుల ఘర్షణ

● కొడుకుపై కేసు పెట్టొద్దంటూ తల్లి ఆత్మహత్యాయత్నం

కదిరి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఘర్షణ పడ్డారు. ఓ విద్యార్థికి తీవ్ర గాయాలు కావడంతో వాటికి కారణమైన విద్యార్థిపై కేసు నమోదు చేశారు. ఆ విద్యార్థిపై కేసు నమోదు చేయవద్దంటూ తల్లి శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే ఆమెను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన మేరకు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు గురువారం రాత్రి ట్యూషన్ నుంచి ఇంటికి వస్తూ స్థానిక ఆంజనేయస్వామి వద్ద ఘర్షణ పడ్డారు. దీంతో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలు అయ్యాయి. తల్లిదండ్రులు ఆస్పత్రిలో చేర్పించి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. దెబ్బలు కొట్టిన విద్యార్థి తల్లి తన కొడుకుపై కేసు నమోదు చేయవద్దంటూ పోలీసులను కోరారు. అందుకు పోలీసులు ఒప్పుకోలేదు. తమ ఫిర్యాదు కూడా తీసుకోవాలని ఆమె కోరారు. ఇందుకు పోలీసులు ససేమీరా అన్నారు. దీంతో ఆమె పోలీస్ స్టేషన్ ఆవరణలోనే చేయి కోసుకొని ఆత్మహత్యకు యత్నించారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఆమెను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు విద్యార్థులపై పరస్పర ఫిర్యాదుల నేపథ్యంలో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వినాయక విగ్రహం చోరీ


విగ్రహాన్ని ఎత్తుకెళ్లిన చోట పరిశీలిస్తున్న క్లూస్ టీమ్ అధికారి అనిల్‌కుమార్

అగళి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక శంకరేశ్వర దేవాలయంలో పురాతన వినాయకుడి విగ్రహాన్ని దుండగులు గురువారం రాత్రి అపహరించారు. శుక్రవారం ఉదయం పూజల కోసం వెళ్లిన భక్తులకు వెళ్లిన భక్తులకు వినాయకుడి విగ్రహం, హుండీ కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ శ్రీరాములు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్‌టీమ్ అధికారి అనిల్‌కుమార్, గుడిబండ ఎస్ఐ రాజకుల్లాయప్ప ఆలయంలో అణువణువు పరిశీలించారు. దేవాలయ చుట్టుపట్ల ఉన్న ప్రజల నుంచి వివరాలు ఆరా తీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలం.. కావాలి జనహితం..

సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ సురేష్‌కుమార్


మాట్లాడుతున్న ఆలపాటి సురేష్‌కుమార్

రాయదుర్గం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు.. జనహితం కోసం కలాన్ని ఉపయోగించాలని సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని తృప్తి గ్రాండ్‌లో ఏపీయూడబ్ల్యూజే నేతృత్వంలో సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో గ్రామీణ జర్నలిస్టులకు రెండురోజుల పాటు శిక్షణా తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఆలపాటి సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విలేకరులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జర్నలిజం వృత్తిలో నిబద్ధత ఉండాలన్నారు. ప్రస్తుతం సమాజంలో విపరీతమైన వేగంతో మార్పులు వస్తున్నాయన్నారను. ఆ వేగాన్ని అందుకునేలా ముందుకు సాగాలన్నారు. దానిని అందుకోవడానికి అప్‌గ్రేడ్ కావాలన్నారు. నిబద్ధతతో నేర్చుకోవాలనే తపన ఉన్న జర్నలిస్టు వృత్తిలో రాణిస్తారన్నారు. జర్నలిజం వృత్తి పట్ల సమాజంలో ఆసక్తి తగ్గిపోతోందన్నారు. దీనికి ప్రధాన కారణం గౌరవం తగ్గడమేనన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ.. శిక్షణా తరగతుల ద్వారా ఎంతోమంది జర్నలిస్టులకు మేలు చేకూరుతోందన్నారు. వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు. శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పయ్యావుల ప్రవీణ్, ఎస్ఎండీ అయూబ్, సీనియర్ జర్నలిస్టులు భోగేష్ రెడ్డి, రామకృష్ణ, కర్నూలు జిల్లా అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

వీఏఏకు నోటీసు

అనంతపురం అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ) నరేష్‌కుమార్‌కు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ షోకాజు నోటీసు జారీ చేశారు. గార్లదిన్నె మండలం మర్తాడు రైతు సేవా కేంద్రంలో పనిచేసే సమయంలో 2024 సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్ ఎరువుల విక్రయాలకు సంబంధించి రైతులు చెల్లించిన నాన్‌సబ్సిడీ డబ్బులు రూ.108478లను వీఏఏ నరేష్‌కుమార్ ఏపీ మార్క్‌ఫెడ్‌కు జమ చేయలేదు. ఇదివరకే వెబ్ కాన్ఫరెన్స్, టెలికాన్ఫరెన్స్ ద్వారా బకాయి డబ్బులు చెల్లించాలని అధికారులు సూచించినా ఆ వీఏఏ పట్టించుకోలేదని షోకాజు నోటీసులో పొందుపర్చారు. శనివారం సాయంత్రం 5 గంటల్లోపు ఏపీ మార్క్‌ఫెడ్‌కు చెల్లించాల్సిన సొమ్మును చెల్లించడంతోపాటు ఎందుకు చెల్లించలేదో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. లేని పక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి హెచ్చరించారు. నరేష్‌కుమార్ ప్రస్తుతం కూడేరు మండలం కూడేరు -2 రైతు సేవా కేంద్రంలో పని చేస్తున్నాడు.

రొళ్ల ఎంపీడీఓకు..

రొళ్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రొళ్ల ఎంపీడీఓకుపై అధికారులు షోకాజు నోటీసులు జారీచేశారు. కర్ణాటకలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో విధుల సమయంలో ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి ఉన్నారని ఎంపీపీ సీఈఓ దృష్టికి పలుమార్లు తెలిపినా పట్టించుకోకపోగా అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని కలెక్టర్ శ్యామ్‌సుందర్‌కు గురువారం ఎంపీపీ కవిత ఫిర్యాదు చేశారు. విధులు నిర్వహిస్తున్న సమయంలో రెస్టారెంట్‌లో ఉండడం ఎంపీడీఓ నిర్లక్ష్యవైఖరికి నిదర్శనమని అతనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ తతంగంపై జడ్పీ సీఈఓ శివశంకర్‌ను వివరణ కోరగా శుక్రవారం ఎంపీడీఓకు నోటీసు జారీచేసినట్లు సీఈఓ తెలిపారు.

ఇద్దరికి డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగోన్నతి

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా ప్రమోషన్ లభించింది. ఉరవకొండ (కూడేరు ఇన్‌చార్జి) తహసీల్దార్ మహబూబ్‌బాషా, రాయదుర్గం తహసీల్దార్ నాగరాజుకు ఉద్యోగోన్నతి దక్కింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 37మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగోన్నతి లభించింది.

వైద్య కళాశాలకు మరో 15 పీజీ సీట్లు

అనంతపురం వైద్యం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): అనంతపురం వైద్య కళాశాలకు మరో 15 పీజీ సీట్లను మంజూరుచేస్తూ జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయశ్రీ శుక్రవారం తెలిపారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ మూడు, అనస్థీషియా, గైనిక్, పీడియాట్రిక్స్ విభాగాలకు నాలుగు చొప్పున మొత్తం 15 సీట్లు కేటాయించినట్లు చెప్పారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి తొలిసారిగా సీట్లు మంజూరు కావడం విశేషం.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురంరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 32 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పాత్రలు

అనంతపురం వైద్యం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని సక్షమ్ అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్తగా స్టోర్ పాత్రలు అందనున్నాయి. వీటి సరఫరాకు శుక్రవారం టెండర్లు నిర్వహించారు. 20 లీటర్ల నీటి క్యాన్, పాత్రల స్టాండ్, ఆహార ధాన్యాలు నిలువ చేసుకునేందుకు మూడురకాల క్యాన్లు, వంట పదార్థాల కొలతల పరికరాలు, డజను చొప్పున ప్లేట్లు, గ్లాసులు సరఫరా చేయనున్నట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.

అర్హులకు పథకాల వర్తింపు

● మత్స్యశాఖ ఇన్‌చార్జి డీడీ చంద్రశేఖర్ రెడ్డి

అనంతపురం అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అర్హులైన మత్స్యకారులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటామని మత్స్యశాఖ ఇన్‌చార్జి డీడీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మత్స్యశాఖ డీడీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆయన మత్స్యసహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులతో సమావేశాన్ని నిర్వ హించారు. మత్స్యసహకార సంఘాలను నిబంధనల మేరకు నిర్వహించేలా చొరవ చూపాలన్నారు. ఇప్పటి దాకా ఎన్నికలు నిర్వహించని సంఘాలకు ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యసహకార సంఘాల అధ్యక్షుడు నాగేష్, ఎఫ్‌డీఓ ఆసీఫ్, ఉమ్మడి జిల్లాలలోని మత్స్యసహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం వైద్యం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఫీల్డ్ స్టాఫ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీఎంహెచ్‌ఎఫ్‌ఈఏ) నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సంఘం ఆధ్వర్యంలో ఎన్జీఓహోమ్‌లో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు చంద్రమోహన్, గౌరవాధ్యక్షుడు లక్ష్మన్న ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఆరోగ్య పరిరక్షణలో వైద్యకేంద్రాలకు, ప్రజలకు వారధిగా క్షేత్రస్థాయి సిబ్బంది పని చేస్తున్నారన్నారు. వారికి దకాల్సిన అవకాశాలు, ఆర్థిక ప్రయోజనాలు గత ఆరేళ్లుగా అందకుండా పోతున్నాయని వాపోయారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 19న నిర్వహించే సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని హెల్త్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్‌ఈఓలు, సీహెచ్‌ఓలు హాజరుకావాలని కోరారు.

బాలికల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్

అనంతపురం వైద్యం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బాలికల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ద్వారా సంపూర్ణమైన సాధికారతను సాధించవచ్చునని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి తెలిపారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. విద్య, ఆరోగ్యం, భద్రత, సమానత్వం బాలికల హక్కులన్నారు. లింగ వివక్షను రూపుమాపితే అన్ని రంగాల్లో బాలికలు ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ జయలక్ష్మి, పరిపాలనాధికారి గిరిజా మనోహర్ రావు, డెమో నాగరాజు, హెచ్‌ఈఈఓ త్యాగరాజు, డిప్యూటీ హెచ్‌ఈఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహ కేంద్రం సిబ్బందికి నోటీసులు

అనంతపురం వైద్యం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ శిశుగృహలోని శిశువు మృతి వ్యవహారంలో చర్యలు కొనసాగుతున్నాయి. గురువారం డీసీఎం బీఎస్ శ్రీదేవికి రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి చార్జ్‌మెమో జారీచేసిన విషయం తెలిసిందే. శుక్రవారం శిశుగృహ మేనేజర్ దీప్తి, సోషల్ వర్కర్ లక్ష్మీదేవి, ఏఎన్ఎం గుణవతి, ఆయాలు ప్రభావతి, ఆదిలక్ష్మి, సులోచన, వాచ్‌మన్‌కు ప్రభుత్వం షోకాజు నోటీసులు జారీచేసింది. విధుల నిర్వహణలో అలసత్వం, సమన్వయలోపం తదితర లోపాల కారణంగా గత నెలలో శిశువు మరణించాడన్న ఆరోపణల నేపథ్యంలో నోటీసులు జారీఅయ్యాయి. రాత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు ఉద్యోగ వర్గాలు తెలిపాయి. ఆయాగా పనిచేసిన సులోచన గతనెల నుంచే విధులకు హాజరు కావడంలేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

మారని తీరు..

శిశుగృహ నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, వారి దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పరిష్కరించకపోవడం తదితర కారణాల నేపథ్యంలో కేంద్రంలోని ఎనిమిదిమంది ఎవరికి వారే అన్నచందంగా వ్యవహరిస్తూ వచ్చారు. ఒకరికొకరు తరచూ గొడవలకు దిగడం, శిశువుల సంరక్షణ గాలికొదిలేయడంతో మరణాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే గతనెల శిశువు మరణించాడు. దీంతో ఉన్నతాధికారులు నిత్యం శిశుగృహను సందర్శించి అక్కడి పరిస్థితులపై దిద్దుబాటుచేపట్టారు. సిబ్బందిలో మాత్రం నేటికీ మార్పు రావడంలేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అది తమ పనికాదనీ, చెప్పినట్లు ఎందుకుచేయాలంటూ వితండవాదం చేస్తున్నట్లు తెలిసింది. బెదిరింపు ధోరణితో అధికారులపైనే తిరగబడుతున్నారని చర్చ సాగుతోంది.

శుభపద్రం మెగా షాపింగ్ మాల్ ప్రారంభం

● సందడి చేసిన సినీ తారలు ఐశ్వర్య రాజేష్, రితికా నాయక్

గుంతకల్లుటౌన్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో శుక్రవారం శుభపద్రం షాపింగ్‌మాల్‌ను ప్రముఖ సినీతారలు ఐశ్వర్య రాజేష్, రితికా నాయక్ ప్రారంభించారు. ఉదయం ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవంలో కథాకళి వేషధారణ, పవన్ కల్యాణ్, బాలకృష్ణ వేషధారణలో ఆటపాటలతో కళాకారులు సందడి చేశారు. శుభపద్రం షాపింగ్ మాల్ ప్రారంభించడానికి ముఖ్యఅతిథులుగా సినీతారలు ఐశ్వర్య రాజేష్, రితికా నాయక్ హాజరయ్యారు. వారు రిబ్బన్ కట్ చేసి మాల్‌ను పారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం షాపులో చీరలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సినీ తారలు మాట్లాడుతూ.. రాయలసీమలో మొట్టమొదట శుభ్రపదం షాపింగ్ మాల్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అన్నిరకాల వేడుకలు, అన్ని మోడల్స్ కుటుంబమంతటికి నచ్చే విధంగా ఇక్కడడ వస్త్రాలు ఉంటాయన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అతి తక్కువ ధరలకే అందించటం శుభప్రదం ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో శుభప్రదం షాపింగ్ మాల్ మేనేజింగ్ డైరెక్టర్ అల్లక సత్యనారాయణ (అలియాస్ సత్య బాబు), ఆపరేషన్స్ హెడ్ ప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, టీడీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు, ఓంకారప్ప, మంజునాథ్, హరిహరనాథ్ తదితరులు పాల్గొన్నారు.


చీరలను చూస్తున్న సినీతారలు ఐశ్వర్యరాజేష్, రితికా నాయక్


మాట్లాడుతున్న ఏపీ చేనేత కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు

24, 25 తేదీల్లో చేనేత అధ్యయన యాత్ర

అనంతపురం విద్య, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమను కాపాడాలనే లక్ష్యంతో ఈనెల 24, 25తేదీల్లో చేనేత అధ్యయన యాత్రను చేపడుతున్నట్లు ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యాల యంలో శుక్రవారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ చేనేత రంగం తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. మిల్లు యజమానుల నిర్ణయాలు, ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా చేనేత పరిశ్రమ దెబ్బతిని నేతన్నలు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. చేనేత రిజర్వేషన్ యాక్టు అమలు చేయాలని, చేనేతలకు ఏటా రూ.25వేలు అందించే నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలని, 200యూనిట్ల వరకు ఉచిత కరెంటు, చేనేతపెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్మిక నాయకులు పురుషోత్తమ, రాధాకృష్ణ, రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.

సచివాలయంలో వైసీపీ నాయకుడి బర్త్ డే


డీ.హీరేహాళ్ సచివాలయంలో అధికారుల మధ్య వైసీపీ నాయకుడి జన్మదిన వేడుకలు

డీ.హీరేహాళ్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు వైసీపీ నాయకుల సంబరాలకు వేదికగా మారాయి. ఇందుకు నిదర్శనమే మండల కేంద్రంలోని ఒక గ్రామ సచివాలయంలో వైసీపీ నాయకుడు జన్మదిన వేడుకలు జరపడం. మండల కేంద్రంలో ఉన్న గ్రామ సచివాలయంలో గురువారం స్థానిక వైసీపీ నాయకుడు సింగాడి మంజునాథ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రమణ, ఇతర గ్రామ సచివాలయ సిబ్బంది ఆ వైసీపీ నాయకుడి సేవలో నిమగ్నమై వేడుకలను ఘనంగా నిర్వహించారు. సచివాలయంలోనే కేక్ కట్ చేసి, సిబ్బందికి పంచిపెట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలు వైరల్ కావడంతో, చూసిన ప్రజలు ఇది ప్రభుత్వ కార్యాలయమా లేకపోతే వైసీపీ కార్యాలయమా అని చర్చించుకుంటున్నారు. కాగా బర్త్‌డే పై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, విచారించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

భారీ స్కోరు దిశగా ఆంధ్ర

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బ్యాటర్ల సెంచరీల మోతతో ఆంధ్రా జట్టు భారీ స్కోర్ దిశగా వెళ్తోంది. సీకే నాయుడు అండర్-23 టోర్నీలో భాగంగా ఆంధ్రా-ఢిల్లీ జట్ల మధ్య అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో మ్యాచ్ ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలిరోజు గురువారం టాస్ గెలిచి ఆంధ్రజట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 74.2ఓవర్లలో స్కోరు 210/2 ఉన్న సమయంలో వర్షం రావడంతో ఆట ముగించారు. రెండోరోజు శుక్రవారం వర్షం కారణంగా ఆలస్యంగా ఆట ఆరంభించారు. ఆటముగిసేసరికి 149ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 470 పరుగులు చేసింది. బ్యాటర్లు ఎస్‌వీ రాహుల్ 292 బంతుల్లో 15 బౌండరీలు, రెండు సిక్సర్లతో 151పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నాడు. అభినవ్ సెంచరీ (101) చేయగా, తేజా 76, సాయిశ్రావణ్ 73పరుగులు చేశారు. దీంతో ఆంధ్రా జట్టు భారీ స్కోర్‌తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు సాఫ్ట్‌బాల్, బేస్ బాల్ క్రీడాకారులు ఎంపికయ్యారు. పంగల్‌రోడ్డు సమీపంలోని స్ఫూర్తి విద్యానికేతన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు బాలికల్లో వేణు వైష్ణవి, బాలురలో భాగ్యనాథ్‌రెడ్డి అండర్-19 సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. బేస్‌బాల్ బాలికల జట్టుకు గుల్షాన్ ఎంపికైంది. వీరు ఎస్‌జీఎఫ్-19 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల కరస్పాండెంట్ వెంకట రమణ, పీఈటీ మహేష్ తెలిపారు.

మద్యం మత్తులో అల్లరి.. జైలుకు యువకులు


అరెస్టు చూపుతున్న సీఐ శ్రీకాంత్ యాదవ్

అనంతపురం క్రైం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): నగరంలోని హౌసింగ్ బోర్డులో మద్యం తాగి రోడ్డుపై హల్‌చల్ చేసిన ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ శుక్రవారం రాత్రి మీడియాకు వెల్లడించారు. ఓబులదేవనగర్‌కు చెందిన తిరుమల రాఘవేంద్ర అలియాస్ బిల్లా, సెవెన్‌హిల్స్ కాలనీకి చెందిన కదిరి అరుణ్‌కుమార్ మద్యం మత్తులో గురువారం రాత్రి హౌసింగ్ బోర్డులోని ఎస్ఆర్ వైన్స్ వద్ద రోడ్డుపై వాహనాలకు అడ్డంగా వెళుతూ న్యూసెన్స్ సృష్టించారు. దీంతో టూటౌన్ పోలీసులు వారిని అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరిచారు. దీంతో ఇద్దరికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తు అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు. వారిద్దరిని రెడ్డిపల్లి జైలుకు తరలించారు.

రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలి



మాట్లాడుతున్న రూరల్ డీఎస్పీ వెంకటేశులు

రాప్తాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు సూచించారు. రాప్తాడు సమీపంలోని లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన లారీ అసోసియేషన్ సభ్యులతో రోడ్డు భద్రతా వారోత్సవాలపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి డ్రైవరు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. అప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. పరిమిత వేగంతోనే వాహనాలు నడపాలని, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయరాదని చెప్పారు. బ్రేక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, రాప్తాడు సీఐ శ్రీహర్ష, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు నీలకంఠారెడ్డి, సభ్యులు, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

పల్లె నివాసానికి అనపర్తి మాజీ ఎమ్మెల్యే



నల్లమిల్లి శేషారెడ్డితో పల్లె కుటుంబ సభ్యులు

అనంతపురంరూరల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, ఆయన కోడలు డాక్టర్ సుగుణారెడ్డి నగర సమీపంలోని ఆలమూరు రోడ్డులోగల మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి నివాసానికి శుక్రవారం వచ్చారు. వారికి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈసందర్భంగా రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. అదేవిధంగా ఎన్ఆర్ఐ పురుషోత్తం, ఎలక్ట్రికల్ డీఈ రవిశంకర్ మాజీ మంత్రి పల్లెను కలిశారు.

కోడింగ్‌తో టెక్నాలజీ అభివృద్ధి



లోగో, పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

అనంతపురం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కోడింగ్ టెక్నాలజీని అభివృద్ధి చేయవచ్చని ఐబీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ టీమ్ లీడర్ వినయ్‌కుమార్ వజ్రకరూర్ అన్నారు. అనంత లక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కోడ్ క్రాఫ్టర్స్ క్లబ్‌ను ప్రారంభించి అందుకు సంబంధించిన లోగో, పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన ఐబీఎం ప్రైవేట్ లిమిటెడ్ టీమ్ లీడర్ వినయ్‌కుమార్‌హాజరై మాట్లాడారు. కోడింగ్ నేర్చుకోవడం ద్వారా విద్యార్థులు సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. అలాగే మొబైల్ యాప్‌లు, వెబ్‌సైట్లు, గేమ్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి టెక్నాలజీలను అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. భవిష్యత్తులో ప్రతి రంగంలోనూ కోడింగ్ పరిజ్ఞానం అవసరం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రాంగణ నియామకాల, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు డాక్టర్ సురేంద్ర నాయుడు, నైపుణ్యాభివృద్ధి విభాగం ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ కీర్తన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ బాలుర హాస్టల్ తనిఖీ



హాస్టల్లో వంటకాలను పరిశీలిస్తున్న అధికారులు

రామగిరి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌ను తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ గంగావతి శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులకు అందించే భోజనాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, వంటలు రుచికరంగా ఉంటున్నాయా అని ఆరా తీశారు. విద్యార్థులు బాగా ఉంటున్నాయని తెలపడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. వార్డెన్‌తో పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైతులకు స్వల్పకాలిక రుణాల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న చైర్మన్ గడిపూటి క్రిష్ణమోహన్ చౌదరి

ఆత్మకూరు అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పి. యాలేరు సొసైటీ కార్యాలయంలో శుక్రవారం రైతులకు స్వల్పకాలిక రుణాలను చైర్మన్ గుడిపూటి క్రిష్ణమోహన్ చౌదరి పంపిణీ చేశారు. మండలంలో 15 మంది రైతులకు గాను రూ. 35 లక్షలకు సంబంధించిన చెక్కులు అందించారు. అలాగే ప్రమాద బీమా కింద జనతా ఇన్సూరెన్స్ ద్వారా వడ్డుపల్లికి చెందిన రామచంద్రారెడ్డికి నామిని అయిన లక్ష్మీనారాయణమ్మకు రెండు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. రైతులకు బ్యాంకు అన్నివిధాలా రుణాలు అందజేసి ఆదుకుంటుందని చైర్మన్ పేర్కొన్నారు. డైరెక్టర్లు బొమ్మయ్య, నారాయణప్ప, బ్యాంక్ మేనేజర్ స్టీఫెన్ కుమార్, టీడీపీ నాయకులు రవీంద్రారెడ్డి, సుధాకర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్...



ప్రింటర్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వెల్దుర్తి ఉన్నతపాఠశాలకు పూర్వపు విద్యార్థులు ప్రింటర్‌ను వితరణ చేశారు. 1995-96వ విద్యాసంవత్సరంలో 10వతరగతి చదివిన విద్యార్థులు ఈ నెల 4వతేదీన పాఠశాలలో గెట్ టు గెదర్ నిర్వహించారు. ఈ క్రమంలో పాఠశాలకు తమవంతుగా తోడ్పాటును అందించాలని నిర్ణయించుకుని ప్రింటర్‌ను సమకూర్చారు. దీంతో శుక్రవారం ప్రింటర్‌ను హెచ్ఎంకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల సిబ్బంది అభినందించారు. పూర్వవిద్యార్థులు మధుసూదన్‌రెడ్డి, కులశేఖర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, కేశప్ప, ఆంజనేయులు, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి తీసుకురండి..

- నిరుపయోగంగా ఎస్సీ బాలికల హాస్టల్ భవనం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని కోరుతున్న ప్రజలు



నిరుపయోగంగా ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్ భవనం

శింగనమల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో పాత ఎస్సీ బాలికల వసతి గృహానికి సంబంధించిన భవనం నిరుపయోగంగా ఉండి శిథిలావస్థకు చేరింది. ఆ భవనాన్ని మరమ్మతులు చేసి ఏదేని ప్రభుత్వ కార్యాలయానికి ఉపమోగించుకునే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఎస్సీ బాలికల వసతి గృహం కోసమని సుమారు 15 ఏళ్ల కిందట రూ.30 లక్షల వ్యయంతో ఆ భవనాన్ని నిర్మించారు. అయితే అప్పట్లో బాలికలు తక్కువగా ఉండడంతో ఆ వసతి గృహాన్ని అనంతపురానికి మార్చారు. ఇక అప్పటి నుంచి ఆ భవనం నిరుపయోగంగా మారి ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఈ ప్రాంతంలోనే కేజీబీవీ , కూమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఉన్నాయి. నిరుపయోగంగా ఉన్న వసతిగృహం భవనంలో కొందరు యువకులు అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తూ వెకిలి చేష్టలు చేస్తున్నారు. దీంతో కేజీబీవీ విద్యార్థినులు, టీచర్లు,ఆస్పత్రి సిబ్బంది, రోగులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిరుపయోగంగా ఉన్న ఆ హాస్టల్ భవనాన్ని మరమ్మతులు చేయించి ఏదేని ప్రభుత్వ కార్యాలయానికి ఉపయోగంచుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

శ్రీకృష్ణదేవరాయలు.. చిరస్మరణీయుడు

- వర్ధంతి సభలో రాయలసీమ బలిజ మహాసంఘం నాయకులు



శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

అనంతపురం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయలు చిరస్మరణీయుడని వక్తలు కొనియాడారు. నగరంలోని బాలాజీ కళ్యాణమండలంలో శుక్రవారం రాయలసీమ బలిజ మహా సంఘం నాయకులు శ్రీకృష్ణదేవ రాయల వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పలువురు మాట్లాడుతూ.. సుమారు 530 ఏళ్ల క్రితం చేసిన శ్రీకృష్ణదేవరాయలు ప్రజల కోసం అనేక సేవలందించారన్నారు. చెరువులు, కుంటలు, బావులు తవ్వించారని, సత్రాలు, ఆలయాలు నిర్మించారని తెలిపారు. అవి ఇప్పటికీ వినియోగంలో ఉన్నాయని పేర్కొన్నారు. కవులను ఆదరించుట, కళలను పోషించుటలో ఆయనకు ఎవరూ సాటి లేరన్నారు. ఇటువంటి మహోన్నత వ్యక్తి వర్ధంతిని ప్రభుత్వం అధికారంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు పాముదాయి వెంకటేష్, నాయకులు టమోటా కృష్ణమూర్తి, పున్నం విజయభాస్కర్, కోనేటి సాయి ప్రసాద్, బళ్లారి వెంకటరాముడు, సూర్యనారాయణ, చలపతి, ప్రభాకర్, సానే ప్రభాకర్, మధుసూదన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లుగా ఎంపికైన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ రమేష్‌బాబు తదితరులు

అనంతపురం రూరల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ రూరల్ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన ఐదుగురు విద్యార్థులు తిరుపాలయ్య, చంద్రమౌళి, రాజకుమార్, శివప్రసాద్, సతీష్ ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇం దుకు వారికి శుక్రవారం వర్సిటీలోని పరిపాలన భవనంలో సన్మానం చేశారు. రిజిస్ట్రార్ రమేష్‌బాబు, రూరల్ డెవలప్‌మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ ముని నారాయణప్ప తదితరులు పూల మాలలు, శాలువాతతో సన్మానించి అభినందించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వ రంగ ఉద్యోగాలు సాధించడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫిరోజ్‌బాబు, టీచింగ్ అసిస్టెంట్లు తిరుపాలు, రామలింగయ్య, పరిశోధక విద్యార్థి విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ స్కిల్‌హబ్‌గా సెంట్రల్ యూనివర్సిటీ

- వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

అనంతపురంవైద్యం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు, విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా సెంట్రల్ యూనివర్సిటీని స్పెషల్ స్కిల్‌హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి తెలిపారు. యూనివర్సిటీలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్(ఎంఎంటీటీసీ) ప్రారంభోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 'పాఠ్య ప్రణాళిక అభివృద్ధి, బోధనా శాస్త్రం, మూల్యాంకనం' అనే అంశంపై జాతీయస్థాయి శిక్షణాతరగతులు నిర్వహిస్తున్నారన్నారు. తద్వారా పాఠ్యప్రణాళిక రూపకల్పన, బోధన పద్ధతులు, మూల్యాంకనం తదితర అంశాల్లో సామర్థ్యాలను బలోపేతం చేసుకోవచ్చునన్నారు. శిక్షణకు నవంబరు 1వరకు ఎంఎంటీటీసీ, సీయూఏపీ వెబ్‌సైట్‌లలో నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్(సీఆర్టీ)పై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాంరెడ్డి, కోఆర్డినేటర్ మాలతి, కన్సల్టెంట్ సుమంత్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



ప్రతిభావంత విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

గార్లదిన్నె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ హైస్కూల్లో ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌కు సంబంధించిన బాక్సింగ్ పోటీల్లో గార్లదిన్నె ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల పీడీ వెంకటేష్ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అండర్-14 బాలుర విభాగంలో లక్ష్మీనరసింహ ప్రతిభ చూపి సిల్వర్ మెడల్ సాధించాడన్నారు. అలాగే అండర్-17లో ఉమల్ బ్రాంజ్ మెడల్, అండర్-19లో అబిదు బ్రాంజ్ మెడల్, అండర్-19 బాలికల విభాగంలో రేవతి బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. అనంతరం ఆ విద్యార్థులను పీడీతో పాటు ప్రిన్సిపాల్ సాకే సతీష్, ఉపాధ్యాయులు అభినందించారు.

గుంతల రోడ్లను బాగు చేయండి

- సీపీఎం నాయకుల డిమాండ్
- గుంతల రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన



నగరపాలకసంస్థ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై వరినాట్లతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అనంతపురం టౌన్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): నగరంలో గుంతల రోడ్లను బాగుచేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. నగరంలో గుంతల రోడ్ల వల్ల ఎదురవుతున్న సమస్యలను వివరిస్తూ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై ఏర్పడ్డ గుంతల్లో శుక్రవారం సీపీఎం నగర కమిటీ నాయకులు, కార్యకర్తలు వరినాట్లు నాటి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ.. నగరంలో ఎక్కడ చూసినా రోడ్లపై గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అయినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహించారు. రెండురోజుల క్రితం రామ్‌నగర్ వద్ద గుంతలను తప్పించబోయి ప్రమాదవశాత్తు కింద పడి భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయని, ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఆమె మరణించడం బాధాకరమని వాపోయారు. ఇలాంటివి పాలకులకు, ప్రజాప్రతినిధులకు ఏమాత్రం పట్టడం లేదని మండిపడ్డారు. నెలరోజుల క్రితమే సప్తగిరి సర్కిల్ వద్ద రోడ్డు వేశారని, అయితే అప్పుడే ఆ రోడ్డు పూర్తిగా డ్యామేజ్ అయిందని, దీన్ని బట్టి చూస్తుంటే రోడ్లు ఎంత నాణ్యతగా వేశారో అర్థమవుతోందని దుయ్యబట్టారు. నాసిరకం రోడ్డు వేసిన కాంటాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరపాలకసంస్థ కమిషనర్ నగరంలోని డివిజన్లలో ఎప్పుడూ పర్యటించిన పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా గుంతల రోడ్లను బాగు చేయాలన్నారు. లేనిపక్షంలో నగర పాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించా రు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్, నగర కమిటీ సభ్యులు ఎస్టీఆర్ శీనా, రాజు, గఫూర్, ఎర్రిస్వామి, రామాంజి, ప్రజాసంఘాల నాయకులు ఇస్మాయిల్, శంకర్, శంషాద్, హాజీవలి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు రైతుల సమావేశం

శింగనమల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆత్మారాముడి ఆలయంలో శుక్రవారం చెరువు ఆయకట్టు అధ్యక్షుడు గార్లదిన్నె సత్యనారాయణ ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. చెరువులో ఉన్న నీటిని బట్టి ఆ యకట్టు భూముల్లో పంటలు సాగు చేయాలని సూచించారు. ఏ పంటలు సాగు చేస్తే ఆ నీరు సరిపోతుందో అందరూ చర్చించుకోవాలన్నారు. చెరువులో నీరు తక్కువగా ఉందని, పంటలకు అవసరమైన నీటిని తీసుకురావాలని ఎమ్మెల్యే బండారుశ్రావణిశ్రీ దృష్టికి తీసుకెళతానని పేర్కొన్నారు.

క్రైస్తవులకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

నార్పల, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలో క్రైస్తవులకు శ్మశాన వాటిక ఏర్పాటుచేయాలని మండల పాస్టర్ల అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండలకేంద్రంలో తహసీల్దార్ అరుణకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సదానందం మాట్లాడుతూ మండల కేంద్రంలో అనేకమంది క్రైస్తవులు నివాసం ఉంటున్నారన్నారు. అయితే వారిలో ఎవరైనా చనిపోతే హిందూ శ్మాశన వాటికలో దహన సంస్కారాలు చేస్తున్నారన్నారు. క్రైస్తవులకు ప్రత్యేకంగా శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని కోరారు. అసోసియేషన్ కార్యదర్శి డేవిడ్‌పాల్, సభ్యులు జాన్, మహరాజ్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఏడీసీసీబీ చైర్మన్ ఆర్థిక సాయం

గార్లదిన్నె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరులో నివాసముంటున్న దూదేకుల వన్నూర్ వలి కుమార్తె వివాహానికి ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి ఆర్థికసాయం చే శారు. జిల్లాకేంద్రంలోని తన నివాసంలో శుక్రవారం తనను కలిసిన వన్నూర్‌వలికి ఆయన రూ.10వేలు అందజేశారు. టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, డిష్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బోగస్ సర్టిఫికెట్లపై విచారణ జరిపించండి

అనంతపురం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో స్పోర్ట్స్‌కు సంబంధించిన ఫేక్ సర్టిఫికెట్లపై విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ కార్యదర్శి రమణయ్య డిమాండ్ చేశారు. ఆమేరకు శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఫేక్ సర్టిఫికెట్లు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా స్పోర్ట్స్ సెలక్షన్ కమిటీలో రెగ్యులర్‌గా ఉన్న వ్యక్తులను కాకుండా గెస్ట్ ఫ్యాకల్టీలను నియమించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిమహేష్, జగదీష్, శీనునాయక్, మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నెలో రైల్వే బ్రిడ్జి నిర్మించాలి: సీపీఐ

గార్లదిన్నె, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో రైల్వేగేట్ వద్ద బ్రిడ్జి నిర్మించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక డ్యాం రోడ్డులోని రైల్వే గేట్ వద్ద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బూదేడు, యర్రగుంట్ల, పెనకచెర్ల, డ్యాం, కొట్టాపల్లి, కమలాపురం, కొప్పలకొండ, మర్తాడు, కోటంక తదితర గ్రామాల ప్రజలు నిమిత్తం గార్లదిన్నె, అనంతపురానికి రాకపోకలు సాగించాలంటే రైల్వే పట్టాలు దాటుకుని వెళ్లాలన్నారు. ప్రస్తుతం రైళ్లు ఎక్కువగా వస్తూ పోతుండడంతో 10 నిమిషాలకు ఓ సారి గేటు పడుతోందన్నారు. దీంతో ప్రజల ప్రయాణానికి తీవ్ర ఆటంకం కలుగుతోందన్నారు. ముఖ్యంగా ప్రాణాపాయ స్థితిలో ఉండి ఆస్పత్రులకు వెళ్లే వారి పరిస్థితి దారుణంగా ఉంటోందన్నారు. దీంతో రైల్వే గేట్ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మించాలన్నారు. దీనిపై పలుమార్లు రైల్వే అధికారులకు తెలిపినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు శ్రీనాథ్‌చౌదరి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, మండలాల కార్యదర్శిలు, సహాయక కార్యదర్శిలు రాముడు, రామాంజనేయులు, రామకృష్ణ, జగన్నాథ్, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడొచ్చు'



సీకేపల్లిలో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

అనంతపురం వైద్యం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎవరికైనా అకస్మాత్తుగా గుండెపోటు వస్తే సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చని యునాని డాక్టర్ రఫిక్ సూచించారు. స్థానిక రెండో రోడ్డులో గల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో శుక్రవారం ఆయన సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శ్వాస తీసుకోలేకపోతున్నప్పుడు, హృదయ స్పందనలు ఆగిపోయినప్పుడు బాధితుల ఛాతీపై గట్టిగా ప్రెస్ చేసి ప్రాణాలను రక్షించే ప్రక్రియను సీపీఆర్ అంటారన్నారు. ప్రతిఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకుని అత్యసరవేళల్లో బాధితుల ప్రాణాలను కాపాడాలని సూచించారు. అనంతరం సీపీఆర్‌ను ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. కార్యక్రమంలో హోమియోపతి డాక్టర్ లాలేనాయక్, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

● చెన్నేకొత్తపల్లి: మండలంలోని మేడాపురం గ్రామంలో గల ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసీహెచ్‌ఓ రాధ మాట్లాడుతూ... ఆకస్మికంగా గుండెపోటు వచ్చిన వ్యక్తులకు వెంటనే సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలను రక్షించవచ్చన్నారు. అనంతరం ప్రాక్టికల్‌గా సీపీఆర్‌చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎంపీహెచ్‌లు సుజాత, రామాంజనేయులు,ఆశావర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో సమస్యలపై చర్చ



అధికారులను ప్రశ్నిస్తున్న కోఆప్షన్ మెంబరు ఇన్యూష్

గార్లదిన్నె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ వెంకటనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యలపై చర్చించారు. కో అప్షన్ మెంబర్ ఇన్యూష్‌తోపాటు పలువురు మాట్లాడుతూ.... మూడు నెలలకు ఒకసారి మండల సమావేశం నిర్వహిస్తున్నారని, అయితే గ్రామాల్లో సమస్యలను మాత్రం పరిష్కరించడం లేదని అధికారులపై మండిపడ్డారు. పలు గ్రామాల్లో వివిధ సమస్యల్ని పరిష్కరించాలని ప్రతి సమావేశంలో తెలియజేస్తున్నా.. ఇంతవరకు పట్టించుకోలేదని వాపోయారు. అలాంటప్పుడు సమావేశాలెందుకని ప్రశ్నించారు. ఇప్పటికైనా పరిష్కరించాలని కోరారు. అనంతరం పలువురు అధికారులు ఆయా శాఖల్లో అమలయ్యే సంక్షేమ పథకాలు వివరించారు. వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఏఓ సోమశేఖర్, ట్రాన్స్ కో ఏఈ విజయ్‌భాస్కర్, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, ఏపీఎం మల్లికార్జున, పశువైద్యాధికారి రమేష్, ఉద్యానవన శాఖ అధికారి రత్నకుమార్, విద్యాశాఖ అధికారి వెంకటరమణ నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మణ్, ఎంపీటీసీల సభ్యులు సురేంద్ర, గీతాభవాని, ధనుంజయ, సర్పంచులు పాల్గొన్నారు.

'తల్లిదండ్రుల కలలను నిజం చేయాలి'



కార్యక్రమంలో పాల్గొన్న వెంకటనాయుడు, గరికపాటి గురజాడ తదితరులు

అనంతపురంరూరల్,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల కలల్ని పిల్లలు నిజం చేయాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రెక్టార్ వెంకటనాయుడు, , సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ గరికపాటి గురజాడ సూచించారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో వెంకటనాయుడు, గరికపాటి గురజాడ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కళాశాలలోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. టెక్నికల్ స్కిల్స్‌ని పెంచుకోవాలన్నారు. ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకుని తల్లిదండ్రుల కలల్ని నిజం చేయాలని తెలిపారు. కళాశాల డీన్ గీతాంజలి, ప్రిన్సిపాల్ రామచంద్ర, కన్వీనర్ లత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై సెమినార్

అనంతపురంరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బాలాజీ పీజీ కళాశాల (ఎంబీఏ)లో సూపర్ జీఎస్టీ అండ్ సూపర్ సేవింగ్స్ అనే అంశంపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుబ్బారావు, అధ్యాపకుడు మురళీధర్ హాజరై మాట్లాడారు. జీఎస్టీ అమలు, అనుసరణ విధానాలు, వ్యక్తులు, వ్యాపార సంస్థలు, స్మార్ట్ ఫైనాన్షియల్ ప్లానింగ్ ద్వారా ఎలా ఎక్కువగా ఆదా చేసుకోవచ్చో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి రాఘవేంద్ర, అధ్యాపకులు ఉమేష్, శివకుమార్, ఆయిషా, సుమలత, ఎరిస్వామి, కీర్తన, సునీత, హరిక పాల్గొన్నారు.

పీఎంఎంవీవైపై రిజిస్ట్రేషన్‌పై శిక్షణ

అనంతపురం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) రిజిస్ట్రేషన్‌పై శుక్రవారం శిక్షణ నిర్వహించారు. మండలంలోని టీవీ టవర్ సమీపంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ ఉమా శంకరమ్మ, ప్రాజెక్టు బ్లాక్ కోఆర్డినేటర్ ప్రసాద్ శిక్షణ ఇచ్చారు. సూపర్ వైజర్ లీలావతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నిజపాద దర్శనం



విశేషాలంకరణలో రుక్మిణీసమేత పాండురంగస్వామి

అనంతపురం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రమా ఏకాదశిని పురస్కరించుకుని రామ్‌నగర్ పాండురంగస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి నిజపాద దర్శనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రుక్మిణీ సమేత పాండురంగస్వామి మూలవిరాట్‌కు ఫలపంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేయడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల చేత పాద స్పర్శ పూజలు చేయించారు. తర్వాత మహామంగళహారతి ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యవర్గ సభ్యులు, భక్తులు భారీగా పాల్గొన్నారు.

వందేభారత్‌కు పురంలో స్టాపింగ్

● రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న



రైల్వేలైన్ పనులను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి, ఎంపీ తదితరులు

మడకశిరటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): త్వరలో హిందూపురంలో వందేభారత్ రైలుకు స్టాపింగ్ కల్పించనున్నట్లు రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని వడ్రపాళ్యం వద్ద జరుగుతున్న రైల్వేలైన్ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలతో కలిసి పనుల పురోగతిపై సమీక్షించారు. ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. రాయదుర్గం-తుమకూరు రైల్వే లైన్ నిర్మాణంతోపాటు విద్యుద్దీకరణ పూర్తి చేసేందుకు ఎల్‌సీఎం పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. 2027 మార్చి నాటికి రైల్వేలైన్ నిర్మాణ పనులు పూర్తవుతాయన్నారు. 192 కిలోమీటర్ల మేరకు రైల్వేలైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. తమకూరు-దావణగెరె ప్రాంతంలో 2027 జూన్, జులై నాటికి శిరా, బరంసాగర, దావణగెరె, చిత్రదుర్గం 400 కిలోమీటర్ల మేరకు రైల్వేలైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. మూడు నుంచి నాలుగు సంవత్సరాల వ్యవధిలో పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్ర సరిహద్దుల్లో నిర్మాణ పనులు వేగంగా సాగేందుకు చంద్రబాబు అన్ని విధాలా సహకారం అందిస్తున్నారని అన్నారు. హిందూపురం నుంచి గుడిబండ మండలంలోని హిరియూరు వరకు కొత్త రైల్వే మార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి స్కూల్లో క్విజ్ పోటీలు: డీఈఓ



కౌశల్ క్విజ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): ప్రతిఉన్నత పాఠశాలలో విద్యార్థులు కౌశల్ క్విజ్ పోటీలో పాల్గొనేలా హెచ్‌ఎం, టీచర్లు చర్యలు తీసుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు ఆదేశించారు. జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన కౌశల్ క్విజ్ పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ శనివారం కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసులు, సైన్స్‌సెంటర్ అధికారి బాలమురళి, ఏఎస్ఓ శ్రీనివాసులు, చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.21

అనంతపురంరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.21తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.12, సరసరిగా రూ.16తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1800 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

బతుకు పోగు..!

(7వ పేజీ తరువాయి)

కూడా గార్మెంట్స్ పరిశ్రమ యాజమాన్యాలకు కలిసివస్తోంది. గార్మెంట్స్ పరిశ్రమల్లో తయారైన ఉత్పత్తులను దేశవిదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. పేరుమోసిన కంపెనీలు జిల్లాలోని గార్మెంట్స్ పరిశ్రమల్లో తయారైన వాటిని కొనుగోలు చేస్తున్నాయి.

ఔత్సాహికులను ప్రోత్సహిస్తే..

2014-19లో టీడీపీ ప్రభుత్వం మహిళా సంఘాలను బలోపేతం చేసి, వారి ఆదాయం పెంచే ప్రయత్నాలు చేసింది. అందులో భాగంగా ప్రతి కుటుంబానికి నెలకు రూ.10వేలు ఆదాయం చేకూర్చాలని భావించింది. జిల్లాలో గార్మెంట్ పరిశ్రమల ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి కల్పించవచ్చని భావించారు. ఆ మేరకు దృష్టి సారించి ఔత్సాహికులను ప్రోత్సహించారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున స్థాపించినా జిల్లాలో కనీసం లక్ష కుటుంబాలకు ఉపాధి కల్పించవచ్చు. ఆ దిశగా 2017లో సీఎం చంద్రబాబు ఆదేశాలతో మంత్రుల బృందం హిందూపురం, పరిగి ప్రాంతాల్లోని గార్మెంట్ పరిశ్రమలను పరిశీలించింది. పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆహ్వానించింది. ఫలితంగా గోరంట్ల, చిలమత్తూరు, మడకశిర ప్రాంతాల్లో మరిన్ని గార్మెంట్ పరిశ్రమల ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. అవి ప్రస్తుతం వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయి.



కోడూరు వద్ద గార్మెంట్ పరిశ్రమలో పనిచేస్తున్న మహిళా కార్మికులు

వైసీపీ ప్రభుత్వం విధానాల కారణంగా గత ఐదేళ్లలో జిల్లాకి ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. ఉన్న అవకాశాలనూ చేజార్చారు. కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచాయి. టీడీపీ హయాంలో రచించిన కార్యాచరణ దిశగా ప్రస్తుతం అడుగులు పడుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో గార్మెంట్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహిస్తే వేలాదిమంది మహిళలకు ఉపాధి లభిస్తుంది. తద్వారా ఆ కుటుంబాలకు ఆర్థిక భరోసా దక్కుతుంది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం గార్మెంట్ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే ఔత్సాహికులను ప్రోత్సహించాలని అనంత వాసులు కోరుతున్నారు.

ఎన్నో కుటుంబాలకు ఉపాధి



వ్యవసాయ పనులులేక చాలాకాలం ఇబ్బందులు పడ్డాం. కోడూరు వద్ద గార్మెంట్స్ పరిశ్రమలు ఏర్పాటవడంతో ఐదేళ్లుగా అందులోకి పనికెళ్తున్నాం. కుటుంబ పోషణకు ఇబ్బంది లేదు. గార్మెంట్ పరిశ్రమలతో ఎన్నో కుటుంబాలకు ఉపాధి లభిస్తోంది. మరిన్ని ఏర్పాటుచేస్తే చాలామందికి ఉపాధి దొరుకుతుంది.

-పార్వతి, కల్లుకుంట, చిలమత్తూరు మండలం

పరిశ్రమ ఏర్పాటు చేయడం మా అదృష్టం



మా ఊరికి దగ్గర్లో గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటుకావడం మా అదృష్టం. కొన్నేళ్లుగా మా గ్రామం నుంచి చాలా మంది గార్మెంట్స్‌లో పనిచేయడానికి బెంగళూరుకు వలస వెళ్లారు. అక్కడ వేతనాలు ఎక్కువగా ఇచ్చినా ఖర్చులు అదేస్థాయిలో ఉంటాయి. దాంతో పెద్దగా మిగలదు. ఊరి సమీపంలోనే గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటుతో వేలాదిమందికి ఉపాధి లభిస్తోంది. కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

-నందిని, మొరసలపల్లి, చిలమత్తూరు మండలం

సొంతూర్లోనే పని దొరికింది



కొడికొండ చెక్‌పోస్టు, కోడూరు తోపులో గార్మెంట్ పరిశ్రమలు ఏర్పాటుకావడంతో చాలామంది మహిళలకు ఉపాధి దొరికింది. లేదంటే బెంగళూరుకి వలస వెళ్లాల్సి వచ్చేది. సొంతూరి వద్దే పని దొరుకుతుండడంతో కుటుంబం గడిచిపోతోంది. ఇలాం టి పరిశ్రమలు మరిన్ని ఏర్పాటుచేసి, వేతనాలు పెంచితే బాగుంటుంది.

-గాయత్రి, కొడికొండ చెక్‌పోస్టు, చిలమత్తూరు మండలం

ఆర్థికంగా నిలదొక్కుకున్నాం: అమరావతి, పరిగి



గతంలో ఇటుకలు బట్టీ పనికి వెళ్తుండేదానిని. రోజంతా కష్టపడితే రూ.150 కూలీ ఇచ్చేవారు. దుమ్ముధూళితో అనారోగ్య సమస్యలు వచ్చేవి. పరిగిలో గార్మెంట్ పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి దొరికింది. ఆర్థిక భరోసా లభించింది.

ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలి



గార్మెంట్ పరిశ్రమలతో వేలాదిమంది మహిళలకు ఉపాధి లభిస్తోంది. మా ఊరి నుంచి 55 కిలోమీటర్లు రోజూ ప్రయాణించి, పరిగిలో గార్మెంట్ పరిశ్రమకు 50 మంది మహిళలు వస్తున్నాం. పరిశ్రమ యాజమాన్యమే బస్సు సౌకర్యంతోపాటు నెలకు రూ.14 వేలు వేతనం ఇస్తోంది. పరిశ్రమ లేకపోతే బెంగళూరుకు వలస వెళ్లాల్సి వచ్చేది.

-శ్వేత, కల్లురొప్పం, రొళ్ల మండలం

క్రీడాకారులకు 'డబుల్' ప్రోత్సాహం: డీఎస్‌డీఓ



సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై ర్యాలీ చేస్తున్న డీఎస్‌డీఓ, కోచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రీడా పరికరాలపై జీఎస్టీ తగ్గింపు, రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ 3శాతానికి పెంచడంతో క్రీడాకారులకు డబుల్ ప్రోత్సాహం దక్కిందని డీఎస్‌డీఓ మంజుల తెలిపారు. శాప్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ఉత్సవాలలో భాగంగా స్థానిక అశోక్‌నగర్ ఇండోర్‌స్టేడియం నుంచి నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇండోర్‌స్టేడియంలో క్రీడాపరికరాల జీఎస్టీ తగ్గింపుపై స్టాల్స్ ఏర్పాటు చేసి క్రీడాకారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ మంజుల మాట్లాడుతూ క్రీడా వస్తువులపై జీఎస్టీ 18శాతం నుంచి 5శాతానికి తగ్గించడంతో క్రీడాకారులకు ఎంతో ఆర్థిక ప్రయోజనం చేకూరిందన్నారు. కార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్స్ డీసీ సుబ్బన్న, ఖైై భారత్ ప్రోగ్రాం ఇంచార్జి శ్రీనివాసులు, శాప్ కోచ్‌లు అనీల్‌కుమార్, ఆలీ, నరేష్, లక్ష్మి, సంధ్య, యువజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ మున్వర్ బాషా, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన మోటార్లు

రాగులపాడు లిఫ్ట్ వద్ద పనిచేయని వైనం

హంద్రీనీవా కాలువ నుంచి ఎస్కేప్ చానల్ ద్వారా నీటి మళ్లింపు



కాలువకు గండి కొట్టి నీటిని మళ్లించిన అధికారులు

వజ్రకరూరు(ఉరవకొండ), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగులపాడు లిఫ్ట్ వద్ద మోటార్లు పనిచేయక పోవడంతో ఛాయాపురం సమీపంలో హంద్రీనీవా నుంచి ఎస్కేప్ చానల్ ద్వారా కాలువకు గండి కొట్టి నీటిని మళ్లించారు. రాగులపాడు 8వ లిఫ్ట్ వద్ద సాంకేతిక లోపం కారణంగా ఏడు మోటార్లు పనిచేయలేదు. మూడు మోటార్లు మాత్రమే పని చేస్తుండటం, లిఫ్ట్‌కు 2900క్యూసెక్కులు వస్తుండటంతో ముందస్తు చర్యలలో భాగంగా కాలువకు గండి పడకుండా ఎస్కేప్ చానల్ ద్వారా హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు నీటిని మళ్లించారు. మోటార్లకు మర్మతులు చేసి, యథావిధిగా పంపింగ్ చేపడతామని అధికారులు తెలిపారు. కాగా ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఛాయాపురం వద్ద కాలువకు గండి కొట్టాల్సి వచ్చిందని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి విమర్శించారు. ఛాయాపురం వద్ద ఎస్కేప్ చానల్‌కు శాశ్వత గేట్లు అమర్చి ఉంటే కాలువకు గండి కొట్టే అవసరముండేది కాదన్నారు. ఎస్కేప్ చానల్‌కు గేట్లు అమర్చి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

31న ఓసీ విద్యార్థి యువగర్జన

ఓసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్‌రెడ్డి

అనంతపురం అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని లలితకళాపరిషత్‌లో ఈనెల 31న నిర్వహించే ఓసీ విద్యార్థి యువగర్జన మహాసభను జయప్రదం చేయాలని ఓసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంజునాథ్ చౌదరి, నాయకులు మాధవరెడ్డితో కలిసి మహాసభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయవర్ధన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఓసీల్లో కూడా పేదలు ఉన్నారని, అత్యంత పేదరికంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని రంగాల్లో అణిచివేతకు గురవుతున్న ఓసీ విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఓసీలు వలసలు పోవడం తదితర అంశాలపై చర్చించేందుకు మహాసభకు రాజకీయ పార్టీల నాయకులు, మేధావులను ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సురేష్‌రాయల్, కేశవరెడ్డి, ఆదికేశవరెడ్డి, ఆదినారాయణరెడ్డి, షాహిద్ అఫ్రిది, శ్రీకాంత్, ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సోమందేపల్లి విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సోమందేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి పోటీలకు సోమందేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం రామాంజనేయులు తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఆయన వివరాలను విలేకరులకు వెల్లడించారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అనంతపురంలోని అనంతలక్ష్మి కళాశాలలో నిర్వహించిన ఈత పోటీల్లో 9, 10తరగతికి చెందిన ప్రత్యూష, నవీన్‌కుమార్, హేమశ్రీ, తరుణ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సాదిక్, రాకేష్, అశ్విన్, నర్మద ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు బాలాజీ నాయక్, రామారావు, అలివేలమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం



సుధీర్ బాబు

సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్ల తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం



సిద్ధు జొన్నలగడ్డ

"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం



జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. డైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.

అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం



'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథా, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

న్యూస్ బాక్స్

పగిలిన తాగునీటి పైప్‌లైన్

రాయదుర్గంరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద శ్రీరామిరెడ్డి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతానికి సరఫరా చేసే పైప్‌లైన్ శుక్రవారం పగిలిపోయింది. వాటర్ ఫౌంటెన్‌ను తలపించేలా నీరు వృథా అయింది. స్థానికులు శ్రీరామిరెడ్డి తాగునీటి సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు నీటి సరఫరాను బంద్ చేశారు.


వృథా అవుతున్న నీరు

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బ్రహ్మసముద్రం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అఫ్తాబ్ ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు సీపీఆర్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాణి ఎస్తేర్ మాట్లాడుతూ.. సీపీఆర్ అంటే కార్డియోపల్మోనరీ రిసిస్టేషన్ అని ఎవరైనా వ్యక్తికి అకస్మాత్తుగా గుండె ఆగిపోయినప్పుడు మెదడుకు ఇతర ముఖ్యమైన అవయవాలకు రక్తాన్ని ప్రసరింపజేయడానికి ఈ పద్ధతిని ఉపయోగిస్తారన్నారు. ఇది ప్రాణాన్ని రక్షించేందుకు సహాయపడుతుందన్నారు. గుండె ఆగిన వెంటనే సీపీఆర్ చేయడం వల్ల బతికే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలక్ష్మీ, ఫార్మసిస్ట్ మహేష్, ల్యాబ్ టెక్నీషియన్ పవన్ కుమార్, ఆశా కార్యకర్తలు రామలక్ష్మీ, ప్రేమక్క పాల్గొన్నారు.

దుకాణాలు సీజ్

గుంతకల్లుటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో అధికంగా బాడుగుల బకాయిలున్న ఎనిమిది దుకాణాలను మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ సీజ్ చేశారు. శుక్రవారం స్థానిక పాతబస్టాండ్, కూరగాయల మార్కెట్‌లో మున్సిపల్ షాపింగ్ గదుల బాడుగుల వసూలు కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. పాతబస్టాండ్‌లో రెండు, కూరగాయాల మార్కెట్ హంపయ్యస్టాల్‌లో ఆరు గదులకు అధిక బకాయిలు ఉండటంతో సీజ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు ఎర్రిస్వామి, సీకే రామాంజినేయులు పాల్గొన్నారు.

నేడు స్వరనీరాజనం

తాడిపత్రి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కండేయస్వామి దేవాలయ ప్రాంగణంలో శనివారం సాయంత్రం ఆరు గంటలకు పద్మశ్రీ నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు 102వ జయంతి సందర్భంగా ఘంటసాల గానసభ సభ్యులు అక్కినేని పాటల స్వర నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గాయకుడు బాలసుబ్రమణ్యం తెలిపారు. సంగీత అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా వాల్మీకి జయంతి

రాయదుర్గంరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురంలో వాల్మీకి మహర్షి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు.


వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న గ్రామస్థులు

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా రంజిత్‌కుమార్



రాయదుర్గంరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రంజిత్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన డీఎస్సీ నియామకాల్లో మంగళగిరి నియోజకవర్గం తాడికొండకు చెందిన రంజిత్‌కుమార్ ఎంపికయ్యారు. దీంతో ఆయన్ను ఇక్కడి మోడల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా అధికారులు నియమించారు.

భూమిపై హక్కు కల్పించాలి

తాడిపత్రి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగం నమ్ముకొని జీవనం సాగిస్తున్న పేదలు, కార్మికులకు భూమిపై హక్కు కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రంగయ్య డిమాండ్ చేశారు. స్థానిక నంద్యాల రోడ్డులోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడారు. ప్రజలకు ఆహారం అందిస్తున్న రైతులు, వ్యవసాయ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. సమావేశంలో నాయకులు వీటీ రామాంజనేయులు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సామూహిక దీక్షలకు సంఘీభావం

గుంతకల్లుటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఐ చేపట్టిన సామూహిక దీక్షలు నాల్గవ రోజైన శుక్రవారమూ కొనసాగాయి. వైసీపీ, బీఎస్పీ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు ఈ దీక్షలకు మద్దతు పలికారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు

ఉరవకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణుమాకులపల్లి సమీపంలో హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ కాలువ వద్ద, దారి పక్కన, పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో పొలాలకు వెళ్లే రైతులు అవి ఎప్పుడు కూలుతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి.. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



రోడ్డు పక్కన, పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

నిద్రలో నిఘానేత్రాలు

- తాడిపత్రిలో పనిచేయని సీసీ కెమెరాలు
- అధికమవుతున్న నేరాలు
- అరికట్టలేకపోతున్న పోలీసులు
- మ్యాట్రిక్స్ కెమెరాలపై ఆధారం

తాడిపత్రి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తాడిపత్రిలోని ప్రధాన కూడళ్లల్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు రెండు సంవత్సరాల నుంచి పనిచేయడం లేదు. ఆర్టీసీ బస్టాండ్, కూరగాయల మార్కెట్, యల్లనూరు రోడ్డు, పుట్లూరురోడ్డు, గాంధీకట్ట, పాతకోట, మెయిన్‌బజారు, చుక్కలూరురోడ్డు నంద్యాల రోడ్డు, నందలపాడు, టైలర్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకార ప్రాయంగా ఉన్నాయి. పట్టణం సమీపంలో సిమెంట్, స్టీల్, నాపరాళ్ల పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో నిత్యం ఇతర రాష్ట్రాల నుంచి భారీ వాహనాలు వస్తుంటాయి. అంతేకాకుండా ఉపాధి కోసం వందలాది మంది వలస కూలీలు ఇతర రాష్ట్రాల నుంచి పట్టణానికి వస్తుంటారు. దీంతో ఇక్కడ నిత్యం రోడ్డు ప్రమాదాలు, చోరీలు జరుగుతుంటాయి. ఇళ్ల వద్ద, బస్టాండు, రైల్వేస్టేషన్, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఉంచిన వాహనాలు చోరీ అవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో పోలీసులు వాటిని రికవరీ చేయలేకపోతున్నారు. దీంతో బాధితులు కూడా పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి.. తిరిగి.. విసిగిపోయారు. పోలీస్‌స్టేషన్‌కు రావడమే మానేశారు. ముఖ్యమైన కేసుల్లో మాత్రం పోలీసులు తప్పనిపరిస్థితుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మ్యాట్రిక్స్ కెమెరాలపై ఆధారపడాల్సి వస్తోంది. మ్యాట్రిక్స్ కెమెరాల ద్వారా క్లిప్పింగులు పరిశీలించాలన్నా.. పోలీసులు విజయవాడకు లెటర్ ద్వారా అధికారులకు తెలియజేసి.. అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇందు కోసం కనీసం 10, 15 రోజులు సమయం పట్టవచ్చు. దీంతో రికవరీ అసాధ్యంగా మారింది. పట్టణంలో సీసీ నిఘా లేకపోవడంతో చోరీలు, నేరాలు అధికమయ్యాయి. దుండగులు నిర్భయంగా చోరీలకు పాల్పడుతున్నారు. దీనిపై సీఐ ఆరోహణరావును వివరణ కోరగా.. సీసీ కెమెరాలు పని చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో పనిచేయని మానిటరింగ్ సిస్టం, వీధిలో పని చేయని సీసీ కెమెరా →

వేళకు బస్సులు నడపాలి


రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

ఉరవకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కళాశాల వేళలకు అనుగుణంగా బస్సులు నడపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఆ మేరకు స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. బల్లనగుడ్డం, పాల్తూరు, గోవిందువాడ, హొన్నూరు మార్గాల్లో బస్సు సర్వీసులు నడపాలని అధికారులను విన్నవించినా పట్టించుకోలేదన్నారు. దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోయారు. విద్యార్థుల రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. విద్యార్థులకు పోలీసులు సర్దిచెప్పి ఆందోళనను విరమింపజేశారు.

మందుబాబులకు అడ్డాగా హైస్కూల్ మైదానం


హైస్కూల్ మైదానంలో పడి ఉన్న మద్యం సీసాలు

బొమ్మనహాళ్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానం సాయంత్రం మందుబాబులకు అడ్డాగా మారుతోంది. రోజూ కొందరు ఆకతాయిలు సాయంత్రం వేళలో ఆ మైదానంలో మద్యం తాగి ఖాళీ సీసాలను, తినుబండరాలు తిని కవర్లను అక్కడే పారేసి వెళ్తున్నారు. ఒక్కోసారి ఆ ఆకతాయులు తాగిన మైకంలో వీరంగం చేస్తూ.. ఖాళీ సీసాలు, పాఠశాల కిటికీలను పగలగొడుతున్నారు. మందుబాబులు బడి మైదానంలోకి రాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని విద్యాకమిటీ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు.

కార్మికుడి మృతి

తాడిపత్రి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగసముద్రం పంచాయతీ సుగుణ స్పాంజ్ ఐరన్ ఓర్ ప్రైవేట్ లిమిటెడ్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న కాంట్రాక్ట్ కార్మికుడు పురుషోత్తం నిషాద్ (35) అనారోగ్యంతో మరణించాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇతను కొంతకాలంగా ఈ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 16న క్వార్టర్స్‌కు వెళుతుండగా రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం కుదుటపడటంతో వైద్యులు అతన్ని డిశ్చార్జ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం అతను మళ్లీ కళ్లు తిరిగి పడిపోయాడు. తోటి కార్మికులు పరిశీలించగా అతను అప్పటికే మరణించినట్లు గుర్తించారు. అతనికి భార్య శాంతకుమారి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

హాస్టల్ వర్కర్‌పై వేటు

రాయదుర్గంరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ సంక్షేమ బాలుర కళాశాల వసతిగృహంలో విధులను నిర్లక్ష్యం చేసిన వర్కర్ మోహన్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ గంగాద్రి శుక్రవారం తెలిపారు. వార్డెన్ పనితీరు కూడా మార్చుకోవాలని హెచ్చరించినట్లు చెప్పారు. హాస్టల్ సరిగా భోజనం పెట్టడం లేదని విద్యార్థులు గురువారం ఆందోళన నిర్వహించిన విషయం తెల్సిందే. దీంతో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆ హాస్టల్‌ను తనిఖీ చేశారు. సమస్యలపై విద్యార్థులతో ఆరా తీశారు. ఇకపై హాస్టల్‌లో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు.

పీఎస్ఐల బదిలీ

పుట్లూరు/యల్లనూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పుట్లూరు సర్కిల్ పరిధిలోని పుట్లూరు, యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లలో పనిచేసే పీఎస్ఐలను శుక్రవారం బదిలీ చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. పుట్లూరు పీఎస్ఐ రామకృష్ణను యల్లనూరు మండలానికి, అక్కడ పనిచేసే సురేష్‌ను పుట్లూరుకు బదిలీ చేశారు.


స్థలాన్ని చదును చేస్తున్న సిబ్బంది

మార్కెట్ నిర్మాణానికి చర్యలు

ఉరవకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక గవిమఠం ఆవరణంలో మార్కెట్ నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. 2004లో కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు పంచాయతీ క్వాటర్స్‌లో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. 21ఏళ్లు గడుస్తున్నా మార్కెట్ నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. దీంతో కూరగాయలు, ఆకుకూరల వ్యాపారులు టవర్‌క్లాక్ కూడలిలో రోడ్డు పైనే వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతుండడంతో మంత్రి కేశవ్ ప్రత్యేక చొరవ తీసుకుని, మార్కెట్‌ను తరలించేందుకు చర్యలు చేపట్టారు. ఈ నెల 8న గవిమఠం ఆవరణంలో మార్కెట్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. పంచాయతీ, గవిమఠం అధికారులు మార్కెట్ నిర్మాణంలో భాగంగా ఆ స్థలాన్ని చదును చేసే పనిలో నిమగ్నమయ్యారు.

నీరు పారేదెలా..?


డిస్ట్రిబ్యూటరీలో పెరిగిన పిచ్చిమొక్కలు

ఉరవకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణుమాకులపల్లి సమీపంలోని 34వ ప్యాకేజీ డీ1 డిస్ట్రిబ్యూటరీ కాలువలో పిచ్చి మొక్కలు భారీగా పెరిగాయి. ఇంద్రావతి నుంచి రేణుమాకులపల్లి వరకూ సుమారు మూడు కిలోమీటర్ల మేర ఉన్న డిస్ట్రిబ్యూటరీ కాలువలో నీరు పారడమే కష్టంగా మారింది. ఈ కాలువ 20 క్యూసెక్కుల దాకా నీరు వదిలారు. కాలువలో ఆ నీరు ముందుకు వెళ్లడం గగనంగా మారింది. కాలువ పిచ్చి మొక్కలు, గుర్రపు డెక్క, ముళ్ల పొదలతో నిండిపోయింది. గత ఐదేళ్లు సాగునీటి ప్రాజెక్టులను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ఈ దుస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ప్రతి ఉపాధి కూలీకి ఈకేవైసీ తప్పనిసరి

బెళుగుప్ప, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లే ప్రతి కూలీకి లబ్ధి చేకూర్చేందుకే ఈకేవైసీ నమోదు తప్పనిసరి అని డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. మండల కేంద్రంలో ఉపాధి సిబ్బంది నిర్వహిస్తున్న ఈకేవైసీ నమోదు ప్రక్రియను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈకేవైసీ వల్ల కలిగే లాభాలపై ఉపాధి కూలీలకు ఆయన అవగాహన కల్పించారు. ఈకేవైసీ నమోదును వేగవంతం చేయాలని ఏపీఓ మురళికి సూచించారు. జిల్లావ్యాప్తంగా 5,82,919 మంది కూలీలు ఉండగా 2,90,744 మందికి ఈకేవైసీ పూర్తి చేశామన్నారు. ఈ నెల 20 లోపు ఈకేవైసీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట టీఏ అవినాష్, ఎఫ్ఏలు ఎర్రిస్వామి, శివ, వన్నూరుస్వామి, తిప్పేస్వామి, సాయి గణేష్ ఉన్నారు.


ఈకేవైసీ నమోదుపై సిబ్బందికి సూచనలిస్తున్న పీడీ

వాలీబాల్ జట్ల ఎంపికకు పోటీలు

తాడిపత్రి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మండలస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ అండర్-17 బాలబాలికల జట్ల ఎంపికకు శుక్రవారం పోటీలు నిర్వహించారు. ఎంఈఓ నాగరాజు మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలకు చాలా మంది విద్యార్థులు రావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శైలజ, విశ్రాంత పీడీ శివయ్య, పీడీలు కేశవమూర్తి, పల్లవి పాల్గొన్నారు.

● గుంతకల్లుటౌన్ : స్థానిక సర్వేపల్లి రాధకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వాలీబాల్ అండర్ 17బాలురు, బాలకల జట్ల ఎంపికకు పోటీలు నిర్వహించారు. మండలంలోని తొమ్మిది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 120 విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఈనెల 21న పామిడిలో నిర్వహించే డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయి. కార్యక్రమంలో ఎంఈఓలు-1,2 మస్తాన్ రావు, సుబ్బరాయుడు, స్కూల్ గేమ్స్ మండల కో-ఆర్డినేటర్ సత్యనారాయణ, పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు, పీఈటీలు పాల్గొన్నారు.

● బెళుగుప్ప : స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని పలు గ్రామాల నుంచి అండర్ 14 విభాగంలో ఏడు జట్లు పాల్గొన్నాయి. నరసాపురం పాఠశాల విద్యార్థులు మొదటిస్థానం దక్కించుకున్నారని స్పోర్ట్స్ కోఆర్డినేటర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 21వ తేదీ డివిజనల్ లెవెల్ పోటీలలో ప్రతిభ కనబరచిన జట్లు పాల్గొంటాయని తెలిపారు. క్రీడాకారులను ఎస్ఎంసీ చైర్మన్ రుద్రయ్య అభినందించారు.

● కణేకల్లు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీలను శుక్రవారం నిర్వహించారు. అండర్ 14 కబడ్డీ బాలికల విభాగంలో మోడల్‌స్కూల్, అండర్ 17 వాలీబాల్ పోటీల్లో గెణిగెర విజేతలుగా నిలిచాయి. ఇక బ్యాడ్మింటన్, చెస్‌లో మోడల్ స్కూల్ విజేతగా నిలిచి డివిజన్ స్థాయి పోటీలకు ఎన్నికైంది. మండల టీడీపీ కన్వీనర్ అనిల్‌చౌదరి తన డబ్బుతో విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 భవానీశంకర్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌ప్రసాద్, పీడీ రమేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు బీటీ రమేష్, షేక్ ముజ్జు, అనిల్, మారుతి పాల్గొన్నారు.


తాడిపత్రి : ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విడపనకల్లు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీశుభోదయ ప్రైవేట్ పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి గురువారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఎంఈఓ మల్లికార్జున శుక్రవారం ఆ పాఠశాలను తనిఖీ చేశారు. మొత్తం 411 మంది విద్యార్థులకు 10 మరుగుదొడ్లు ఉండాల్సి ఉండగా.. కేవలం రెండు మాత్రమే ఉన్నాయి. తాగునీటి సౌకర్యమూ లేదు. వారం రోజుల్లో పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని, లేకుంటే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంఈఓ హెచ్చరించారు.

మురుగు డ్రైనేజీలోకి మళ్లింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కూడేరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రధాన రహదారికి అనుకొని ఉన్న డ్రైనేజీ నుంచి మురుగు బయటకు వచ్చి రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై ఈ నెల రెండో తేదీన ఓ ప్రథనాన్ని ఆంధ్రజ్యోతి ప్రచురించింది. దీంతో టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు సూచన మేరకు స్థానిక సర్పంచు లలితమ్మ, అధికారులు ఆ మురుగు డ్రైనేజీలోకి వెళ్లేలా పైపులైన్ ఏర్పాటుచేయించారు. సమస్య పరిష్కారం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పైపులైన్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

అక్రమ వసూళ్లపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పుట్లూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐకేపీ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు, అధికారులు వడ్డీలేని రుణాలపై అక్రమ వసూళ్లు చేస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి శుక్రవారం ఓ కథనాన్ని ప్రచురించింది. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐకేపీ ఏరియా కో ఆర్డినేటర్ వీరాస్వామి ఆరా తీశారు. దీనిపై జిల్లా అధికారులకు నివేదిక ఇస్తున్నట్లు సమాచారం.

వృద్ధ దంపతులకు చేయూత



గతంలో ఉన్న పూరిపాక, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న షెడ్

పామిడి అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుంపల్లి గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు సుంకన్న సుంకమ్మకు అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత సత్యనారాయణరెడ్డి అండగా నిలిచారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా అనుంపల్లిలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ పర్యటించారు. తమ ఇల్లు కూలిపోవడంతో పట్టలతో పూరిపాకను వేసుకొని అందులోనే జీవిస్తున్నామని ఆ వృద్ధ దంపతులు వారి వద్ద వాపోయారు. అది విన్న సత్యనారాయణరెడ్డి ఆ వృద్ధ దంపతులకు ప్రభుత్వం గృహం మంజూరు చేసేంత వరకూ తన సొంత డబ్బుతో షెడ్డు నిర్మిస్తానని సత్యనారాయణరెడ్డి మాట ఇచ్చారు. ఆ మేరకు రెండు నెలలోనే షెడ్ పనులు ప్రారంభించారు. త్వరలోనే నిర్మాణాన్ని పూర్తి చేసి.. ఆ దంపతులకు అందజేస్తానని సత్యనారాయణరెడ్డి తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుట్లూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో బాక్సింగ్, ఉషు పోటీల్లో స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. బాక్సింగ్ పోటీల్లో ప్రత్యూష వెండిపతకం, భార్గవి రజత పతకం, ఉషు క్రీడల్లో జగన్‌మోహన్‌రెడ్డి, కార్తీక్, అలీఫ్ వెండిపతకాలు, మధుకిరణ్, మణికంఠారెడ్డి రజత పతకాలు సాధించారని ఎంఈఓ శ్రీదేవి శుక్రవారం తెలిపారు. వారిని అభినందించారు.

విజేతలకు బహుమతులు


విజేత విద్యార్థులతో అధ్యాపకులు

కళ్యాణదుర్గంరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ వారోత్సవాల్లో భాగంగా ఈనెల ఆరు నుంచి 13వ తేదీ వరకు స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ తదితర పోటీలను నిర్వహించారు. ఆ పోటీల్లో విజేత విద్యార్థులకు శుక్రవారం బహుమతు లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హర్షలత, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అర్థశాస్త్ర విభాగ అధిపతి శేషయ్య, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి రాధాకృష్ణ పాల్గొన్నారు.

జోరుగా పప్పుశనగ సాగు

విడపనకల్లు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో పప్పుశనగ సాగును జోరుగా సాగుతోంది. మళాపురం, పెద్ద కొట్టాల పల్లి, విడపనకల్లు, గడేకల్లు, అంచనహాలు, జనార్ధన పల్లి, పొలికి తదితర గ్రామాల్లో పప్పుశనగను సాగు చేస్తున్నారు. ఎకరాకు 50 కేజీల నుంచి 60 కేజీల వరకూ విత్తనం వేస్తున్నట్లు రైతులు తెలిపారు. ఈ నెల చివరి వరకూ పప్పుశనగ సాగు చేయవచ్చని రైతులు అంటున్నారు.


పప్పుశనగ విత్తనం విత్తుతున్న రైతు